క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అక్కిరెడ్డిపాలెం: 11 కేవీ మింది ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్–2 ఈఈ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మింది, రాజీవ్ నగర్, రాంనగర్ పరిధిలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలియజేశారు.

గాజువాక సబ్‌స్టేషన్ పరిధిలో..

గాజువాక : గాజువాక విద్యుత్ సబ్ స్టేషన్‌లోని హైస్కూల్ రోడ్, బీసీ రోడ్, మార్కెట్ రోడ్ ఫీడర్లకు ఈ నెల 21న నిర్వహణ పనులను చేపట్టనున్నట్టు ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా జోగివానిపాలెం, హైస్కూల్ రోడ్, పెంటయ్య నగర్, సాయిరామ్ నగర్, అశోక్ నగర్, గాజువాక మెయిన్ రోడ్, కైలాస నగర్, శ్రీకృష్ణ, లక్ష్మీకాంత్, మోహినీ థియేటర్ ఏరియాలలో శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం పరిశీలన



మింది హైస్కూల్లో అదనపు గదుల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ అనూష

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు మింది జిల్లా పరిషత్ హైస్కూల్లో అదనపు గదుల నిర్మాణ పనులను కార్పొరేటర్ గుడివాడ అనూష, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ బుధవారం పరిశీలించారు. నాడు–నేడులో భాగంగా రెండో విడత జరుగుతున్న నిర్మాణంలో పనుల పురోగతిని హెచ్ఎం వి.వి.ఎస్.ఎస్.ఆంజనేయులు అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యత పాటించేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు వరదాల వెంకటరమణ, నంబార్ రాజు, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాలమ్మ పండగ



అమ్మవారి దర్శనానికి వచ్చిన ఏడీసీ సన్యాసిరావును సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధి రామచంద్రనగర్ సమీపంలోని డంపింగ్ యార్డ్ వద్ద ఉన్న నూకాలమ్మ వారి పండగ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పబ్లిక్ హెల్త్ ఎన్విరాన్ అండ్ అవుట్‌సోర్సింగ్ డ్రైవర్స్ ఆధ్వర్యంలో బుధవారం నెల పండగను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏడీసీ వి.సన్యాసిరావు, జీవీఎంసీ జోన్–6 జోనల్ కమిషనర్ సింహాచలం, ఏఎంఓహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్, ఎస్ఎస్ రామారావు, ఎస్ఐ బి.అప్పలరాజు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు.

ఏపీడీకి అభినందనలు



యూసీడీ ఏపీడీ రాముకు అభినందనలు తెలుపుతున్న కార్యదర్శులు

అక్కిరెడ్డిపాలెం: నూతనంగా నియమితులైన యూసీడీ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాముకు గాజువాక సచివాలయ కార్యదర్శులు సాదర స్వాగతం పలికారు. గాజువాకలోని యూసీడీ కార్యాలయంలో బుధవారం ఆయన్ను కలిసి, శాలువాతో సత్కరించారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. డెమొక్రటిక్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జోసెఫ్ కిషోర్, విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు డి.సూర్య, జిల్లా కమిటీ సభ్యులు, ఇతర కార్యదర్శులు పాల్గొన్నారు.

గురజాడ కళాక్షేత్రం పునరుద్ధరణకు చర్యలు

- త్వరలోనే అందుబాటులోకి..
- స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల హర్షం



హాల్లోని వస్తువులు తరలిస్తున్న సిబ్బంది



గురజాడ కళాక్షేత్రం



ఖాళీ చేసిన కళాక్షేత్రం హాలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో గురజాడ కళాక్షేత్రం ఉద్యోగులకు త్వరలో అందుబాటులోకి రానుంది. కోవిడ్ సెంటర్‌గా తీర్చిదిద్దిన కళాక్షేత్రం పునరుద్ధరించేందుకు టౌన్ అడ్మినిస్ట్రేషన్, మెడికల్ విభాగం ఆధ్వర్యంలో చర్యలు ప్రారంభించారు.

నగరంలోని పేరెన్నికగన్న ఫంక్షన్ హాళ్లలో ఒకటైన ఉక్కునగరం గురజాడ కళాక్షేత్రం స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు అతి ముఖ్యమైనది. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అధికారిక కార్యక్రమాలు, కార్మిక సంఘాల సదస్సులు, ఉద్యోగులు, వారి కుటుంబీకుల ఫంక్షన్ల కోసం యాజమాన్యం టౌన్‌షిప్‌లోని సెక్టార్–9లో విశాలంగా సెంట్రలైజ్డ్ ఏసీతో గురజాడ కళాక్షేత్రాన్ని ఏర్పాటు చేసింది. కళాక్షేత్రం ఆవరణలో అందమైన గార్డెన్, లోపల, బయట సుమారు రెండు వేల మంది సామర్థ్యంతో ఎటువంటి ఫంక్షన్లు అయినా చేసుకునే సదుపాయం కల్పించారు. కేవలం 10 వేల రూపాయలతో ఘనంగా ఫంక్షన్ చేసుకునే సదుపాయం ఉండటంతో ఉద్యోగులు అందులో ఫంక్షన్లు చేసుకోవడానికి ఎక్కువగా ఆసక్తి చూపుతారు. ఉక్కు యాజమాన్యం టౌన్ అడ్మినిస్ట్రేషన్ అధికారి పర్యవేక్షణలో కళాక్షేత్రం నిర్వహిస్తుంటారు. సీనియార్టీ ప్రాతిపదికన ఉద్యోగులకు కళాక్షేత్రాన్ని కేటాయిస్తుంటారు.

నాటి నుంచి కోవిడ్ సెంటర్‌గానే..

రెండేళ్ల క్రితం కరోనా తీవ్రంగా ఉన్నప్పుడు నగరంలోని అన్ని ఆసుపత్రుల్లో బెడ్స్ లేని పరిస్థితి అందరికీ తెలిసిందే. ఉక్కు జనరల్ ఆస్పత్రిలోనూ అదే పరిస్థితి తలెత్తడంతో నాటి జిల్లా కలెక్టర్ సూచనలతో గురజాడ కళాక్షేత్రంలో 200 బెడ్‌లతో కోవిడ్ సెంటర్‌గా తయారు చేశారు. అది ఏర్పాటు చేసిన నెల రోజుల్లో కోవిడ్ తగ్గిపోయింది. అయితే అప్పటి నుంచి కళాక్షేత్రం కోవిడ్ సెంటర్‌గానే మిగిలిపోయింది. ఫంక్షన్ హాల్ అందుబాటులో లేకపోవడంతో ఉద్యోగులు తమ ఫంక్షన్ల కోసం బయట ప్రాంతాలపై ఆధారపడాల్సి వస్తోంది. అది వారికి ఆర్థిక భారమవుతోంది. ఈ నేపథ్యంలో గురజాడ కళాక్షేత్రంలో కోవిడ్ సెంటర్‌ను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు, కార్మిక సంఘాలు యాజమాన్యం దృష్టికి తెచ్చారు. దీంతో యాజమాన్యం జిల్లా యంత్రాంగం అనుమతితో కళాక్షేత్రం పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. దీంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చురుగ్గా పనులు

మెడికల్ అడ్మిన్ అధికారి క్రాంతికుమార్ నేతృత్వంలో సీఐఎస్ఎఫ్ సిబ్బంది సహకారంతో అందులోని బెడ్స్, పైపు లైన్లు తొలగింపు పనులు చేపట్టారు. త్వరలో టౌన్ అడ్మిన్ విభాగం ఆధ్వర్యంలో కొద్దిపాటి రిపేర్ పనులు, పెయింటింగ్ పనులు పూర్తి చేసి ఉద్యోగులకు అందుబాటులో తేనున్నారు. మే నెలాఖరు లేదా జూన్ నెలలో కళాక్షేత్రం ఉద్యోగులకు అందుబాటులోకి తేనున్నట్టు టౌన్ అడ్మిన్ అధికారుల సమాచారం.

సీఎంగా మళ్లీ జగనే రావాలి..

- ముక్తకంఠంతో చెబుతున్న ప్రజలు
- ఉత్సాహంగా 'మా నమ్మకం నువ్వే జగన్'



88వ వార్డు జీవీఎంసీ కాలనీలో మహిళలకు బ్రోచర్ అందిస్తున్న నాయకులు

అగనంపూడి: ఎన్నికలు ఎప్పుడొచ్చినా మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డినే ఎన్నుకుంటామని ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారని 88వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ గండ్రెడ్డి కనక మహాలక్ష్మినాయుడు, గాజువాక క్లస్టర్ జీసీఎస్ కన్వీనర్ వాడపల్లి రామచంద్రరావు అన్నారు. 88వ వార్డు జీవీఎంసీ కాలనీలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో శ్యామ్, రాజు, చిట్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

➡ 79వ వార్డు అగనంపూడి ప్రశాంతినగర్ సచివాలయ పరిధిలో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ అప్పికొండ మహాలక్ష్మినాయుడు, క్లస్టర్ కన్వీనర్ రామచంద్రరాజు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు తమ్మిన శ్రీహర్ష, మామిడి శ్రీను, నెల్లి శ్రీనమ్మ పాల్గొన్నారు.

పాత గాజువాక జంక్షన్‌ను పరిశీలించిన నిపుణుల కమిటీ

విస్తరణలో భాగంగా వాహనాల ట్రయల్ రన్ పరిశీలన



జంక్షన్‌ను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

గాజువాక : పాతగాజువాక జంక్షన్ విస్తరణను నిపుణుల కమిటీ సభ్యులు బుధవారం పరిశీలించారు. ఈ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు జంక్షన్ ఆధునీకరణ, విస్తరణ పనులను ఇప్పటికే ప్రారంభించిన విషయం తెలిసిందే. దానిలో భాగంగా ప్రతిపాదించిన జంక్షన్ నమూనా ప్రకారం వాహనాల ట్రయల్ రన్ నిర్వహించారు. ట్రయల్ పూర్తి కావడంతో జీవీఎంసీ, గీతం సివిల్ ఇంజినీరింగ్, గాజువాక ట్రాఫిక్ విభాగాలకు చెందిన అధికారులు జంక్షన్‌ను పరిశీలించి సమీక్షించారు. అనంతరం ప్రతిపాదిత జంక్షన్ నమూనాను ఖాయం చేసినట్టు జీవీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రసాద్‌బాబు, గాజువాక సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు. రోడ్డు మధ్యలో ఉన్న హైమాస్ట్ లైట్‌ను మొదటి దశలో నమూనా ప్రకారం సవరించి, త్వరలోనే పూర్తి స్థాయి పనులను చేపడతామని పేర్కొన్నారు.

నీటి చౌర్యానికి చెక్

అక్రమ మోటార్లను తొలగించిన జీవీఎంసీ సిబ్బంది



మోటార్లను తొలగిస్తున్న సిబ్బంది

పెదగంట్యాడ: నీటి చౌర్యానికి జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అధికారులు చెక్ చెప్పారు. అక్రమంగా ఏర్పాటు చేసిన మోటార్లను తొలగించారు. జీవీఎంసీ 76వ వార్డు బాలచెరువు ప్రాంతంలోని పలు ఇళ్లకు తాగునీటి కుళాయిలు కనెక్షన్లు ఉన్నాయి. అయితే ఆ ఇళ్ల యజమానులు మున్సిపల్ పైపులైన్లకు నేరుగా మోటార్లను బిగించి నిత్యం నీటిని చౌర్యం చేస్తున్నారు. దీంతో దిగువ ప్రాంతంలోని ఇళ్లకు సరిపడా తాగునీరు సరఫరా కావడం లేదు. ఈ నేపథ్యంలో స్థానికులు కొంతకాలం నీటి చౌర్యంపై అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన జీవీఎంసీ నీటి సరఫరా విభాగం ఏఈ కేదార్‌నాథ్ పరిశీలనలు సిబ్బందిని ఆదేశించారు. వాటిని పరిశీలించిన సిబ్బంది, అక్రమంగా ఏర్పాటు చేసిన మోటార్లను తొలగించారు. ఎవరు మోటార్లతో నీటి చౌర్యానికి పాల్పడితే కుళాయి కనెక్షన్లు తొలగిస్తామని హెచ్చరించారు.

పలువురు ప్రముఖులకు సత్కారం

గాజువాక : వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురు ప్రముఖులను స్థానిక అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ట్రస్ట్ 12వ వార్షికోత్సవం సందర్భంగా గాజువాక హైస్కూల్ రోడ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వారికి అవార్డులను ప్రదానం చేశారు. క్రీడలు, కళల్లో సేవలందిస్తున్న కరణం నర్సింగరావు, పోలీస్ విభాగంలో సీఐ భాస్కరరావు, రక్తదానం చేస్తున్న వినోద్ బాబు, కళాకారుడు రవితేజ, సేవారంగం నుంచి అప్పలరాజు, ఆర్మీ నుంచి రౌతు గోవింద్, జీవీఎంసీ నుంచి నాగార్జున తదితరులను సత్కరించారు. అనంతరం పేద మహిళలకు చీరలను, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ పర్సన్ పల్లా చినతల్లి, స్థానిక నాయకులు యువశ్రీ, గూటూరు శంకరరావు, కోన తాతారావు, బుద్ద శివాజీ, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు 26న బహిరంగ సభ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వామపక్షాల నాయకులు

మల్కాపురం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఈ నెల 26న కుర్మన్నపాలెం జంక్షన్ వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నామని సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు జగ్గునాయుడు, పైడిరాజు తెలిపారు. ఈ మేరకు బుధవారం పీతాపురం కాలనీలోని పార్టీ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బహిరంగ సభకు ప్రజలు, కార్మికులు, మహిళలు, యువతీ యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 14న ప్రారంభించిన ప్రచార భేరి కార్యక్రమం 30వ తేదీ వరకూ కొనసాగుతుందన్నారు. బీజేపీ విధానాలను ఎండగట్టడానికి 2 లక్షల కరపత్రాలు పంపిణీతో పాటు, గ్రూపు మీటింగ్‌లు చేపడుతున్నామన్నారు. విశాఖ ఉక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

రచ్చకెక్కిన అన్నదమ్ముల వివాదం

- కుల బహిష్కరణ చేశారంటూ ఫిర్యాదు
- విచారించిన తహసీల్దార్, అన్నదమ్ముల గొడవగా నిర్ధారణ

పెదగంట్యాడ: అన్నదమ్ముల గొడవ రచ్చకెక్కింది. కల్లు దుకాణం విషయంలో ఇద్దరి మధ్య చోటు చేసుకున్న ఘర్షణ కుల బహిష్కరణ వెళ్లిందని సోషల్ మీడియాలో బుధవారం జోరుగా ప్రచారమైంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించి వివరాలివి. మండలంలోని ముదపాకు గ్రామంలో నివసిస్తున్న దొడ్డి కృష్ణ ఇంటి వద్ద కల్లు దుకాణం ఏర్పాటు చేసుకున్నారు. అతని సోదరుడు దొడ్డి దేవరాజ్ నిత్యం గొడవలకు దిగుతుండటంతో పాటు కల్లు దుకాణాన్ని అక్కడ నిర్వహించవద్దని దాడులకు పాల్పడ్డాడు. కృష్ణ కుల పెద్దలను ఆశ్రయించారు. దేవరాజ్‌ను కుల పెద్దలు చర్చలకు ఆహ్వానించినా వెళ్లలేదు. ఈ నేపథ్యంలో దేవరాజ్ నిత్యం ఇదే వద్దే ఉంటూ తనతో తానే బాధపడుతుండేవాడు. గమనించిన దేవరాజ్ కుమారుడు వెంకటేష్ తమ కుటుంబాన్ని కుల బహిష్కరణ చేశారంటూ స్థానిక సచివాలయంలో, కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశాడు. తమతో ఎవరూ మాట్లాడకూడదని, ఎవరైనా మాట్లాడితే రూ.పది వేలు జరిమానా విధిస్తామని కులపెద్దలు దండోరా వేయించారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. స్పందించిన కలెక్టర్ వెంటనే పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. దీంతో తహసీల్దార్ రమాదేవి స్వయంగా ముదపాకు వెళ్లి, గ్రామ పెద్దలతో మాట్లాడారు. దేవరాజ్‌ను అన్నిసార్లు పిలిచినా తమ వద్దకు రాలేదని, దీంతో తాము కూడా ఆ కుటుంబంతో మాట్లాడడం మానేశామని వారు తెలిపారు. అక్కడితో పరిస్థితి సద్దుమణిగిందని అనుకున్నామన్నారు. దీనిపై తహసీల్దార్ రమాదేవి మాట్లాడుతూ ఇది ఇద్దరు అన్నదమ్ముల గొడవగా తేలిందన్నారు. ఇందులో ఏ కుటుంబాన్నీ కుల బహిష్కరణ చేసినట్టు తమ దృష్టికి రాలేదని చెప్పారు. భవిష్యత్తులో ఇద్దరూ ఎటువంటి గొడవలకు దిగకుండా ఉండాలని హెచ్చరించారు.

సింహగిరికి గంధం అమావాస్య తాకిడి

- భారీగా చేరుకున్న భక్తులు



పుష్కరిణిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

సింహాచలం: గంధం అమావాస్య పురస్కరించుకుని ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పెద్ద ఎత్తున గ్రామీణ ప్రాంతాల భక్తులు, మత్స్యకారులు బుధవారం సాయంత్రానికే సింహాచలం చేరుకున్నారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో చందనోత్సవం ముందు వచ్చే అమావాస్యను గ్రామీణ ప్రాంతాల భక్తులు, మత్స్యకారులు పవిత్రంగా భావిస్తారు. కుటుంబాలతో కలిసి సింహగిరికి తరలివస్తారు. ముందు రోజు చేరుకుని వరాహ పుష్కరిణిలో స్నానాలు ఆచరిస్తారు. వంటలు వండుకుని పంక్తి భోజనాలు చేస్తారు. ఈ సారి గంధం అమావాస్య గురువారం కావడం, అమావాస్య బుధవారం ఉదయం 11గంటల నుంచే రావడంతో మధ్యాహ్నం నుంచి భక్తులు విశేషంగా తరలివచ్చారు. రాత్రికి భక్తుల సంఖ్య భారీగా పెరిగింది. భక్తులతో వరాహ పుష్కరిణి మార్గం అంతా కిటకిటలాడింది.

గౌతు లచ్చన్నకు నివాళులు



గౌతు లచ్చన్న విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు



పీలానగర్‌లో గౌతులచ్చన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పెట్రోల్ బంక్ యాజమాన్యం

కూర్మన్నపాలెం: సర్దార్ గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీయమని నాయకులు కొనియాడారు. బుధవారం ఆయన వర్ధంతిని పురస్కరించుకుని ఘన నివాళులర్పించారు. 87వ వార్డు కణితి కాలనీలో శ్రీ రథాలమ్మ శెట్టిబలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కణితి గ్రామ కమిటీ సభ్యులు ఎస్.ఎస్.విజయరామారావు, ప్రగడ వేణుబాబు, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, ప్రగడ రాము, బద్ద తాత, సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

➡ గౌతు లచ్చన్న విగ్రహానికి 87వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు బొడ్డ గోవింద్ తదితరులు నివాళులర్పించారు. పోతల కృష్ణ, అంగటి సూరరాజు, గెద్దాడ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

➡ వడ్లపూడి గ్రామంలోని గౌతు లచ్చన్న విగ్రహానికి ఏపీ స్టేట్ యాత కార్పొరేషన్ డైరెక్టర్ అండిబోయిన లక్ష్మి నివాళులర్పించారు. అండిబోయిన అప్పారావు, నెల్లి సాధురావు, దొమ్మేటి రమణారావు తదితరులు పాల్గొన్నారు.

➡ యాత శెట్టిబలిజ గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో నెల్లి అప్పలరాజు, బత్తిన పరదేశి, సంఘంగి ఈశ్వరరావు, ఏకల వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

75వ వార్డులో..

పెదగంట్యాడ: గౌతు లచ్చన్న వర్ధంతిని నెల్లిముక్కులో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, నాయకులు పులి వెంకటరమణారెడ్డి, దొమ్మేటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పీలానగర్‌లో..

అక్కిరెడ్డిపాలెం: గౌతులచ్చన్న వర్ధంతిని పీలానగర్‌లోని అనూరాధా ఆటో సర్వీసెస్ (పెట్రోల్ బంక్)లో నిర్వహించారు. పెట్రోల్ బంక్ వద్ద గల గౌతులచ్చన్న విగ్రహానికి యాజమాన్యం పూల మాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈ పెట్రోల్ బంక్ సిబ్బందికి మజ్జిగను పంపిణీ చేశారు.

పెందుర్తి పీఏసీఎస్ చైర్మన్‌గా శరగడం



శరగడం నరసింహమూర్తి

సింహాచలం: పెందుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌గా వైఎస్సార్ సీపీ సీనియర్ నేత శరగడం నరసింహమూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు సహకార అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే శరగడంతో పాటు డైరెక్టర్లుగా పెందుర్తి మండలం సరిపల్లికి చెందిన గొర్లపల్లి భాస్కరరావు, అక్కిరెడ్డిపాలెంకి చెందిన జనరపు గోవింద్ నియమితులయ్యారు. తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌కు నరసింహమూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



రమణారెడ్డి (ఫైల్ ఫోటో)

అక్కిరెడ్డిపాలెం: పనులకు వెళ్లక, మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గాజువాకలోని గొంతినవాని పాలెంలో బుధవారం చోటు చేసుకుంది. గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గొంతినవానిపాలెంకి చెందిన డి.రమణారెడ్డి (45) మేస్త్రి పనులతో పాటు ప్రైవేట్ పనులు చేస్తుండేవాడు. కొంతకాలంగా పనులకు వెళ్లక మద్యానికి అలవాటు పడ్డాడు. రమణారెడ్డి భార్య మౌనిక పనులకు వెళ్తోంది. భార్య బుధవారం పనులకు వెళ్లగా.. మధ్యాహ్నం రమణారెడ్డి ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన మౌనిక, భర్త ఆత్మహత్యకు పాల్పడటం గమనించి గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనాస్థలానికి చేరుకున్న గాజువాక పోలీసులు వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఎస్ఐ నజీర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్టు తెలిపారు. మృతునికి 5 సంవత్సరాల బాబు ఉన్నాడన్నారు.

సీపీఎం నాయకుడు కృష్ణమూర్తి కన్నుమూత



కృష్ణమూర్తి (ఫైల్)

ఆరిలోవ: సీపీఎంలో సుదీర్ఘ కాలం సేవలు అందించిన వి.కృష్ణమూర్తి(67) బుధవారం వేకువజామున గుండెపోటుతో కన్నుమూశారు. ఆరిలోవలోని ఆయన నివాసంలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు విమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కేజీహెచ్‌కు తీసుకెళ్లాలని అక్కడ వైద్యులు పరిశీలించి నమయానికి ఆయన మృతి చెందినట్లు వెల్లడించారు. దీంతో కుటుంబ సభ్యులు ఆరిలోవకు తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న సీపీఎం, సీపీఐ, వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు పెద్ద సంఖ్యలో చేరుకుని కృష్ణమూర్తి భౌతిక కాయానికి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, కార్పొరేటర్ బి.గంగారావు, సీపీఎం రాష్ట్ర, జిల్లా నాయకులు ఎస్.నరసింహారావు, ఆర్.కె.ఎస్.వి.కుమార్, ఎం.జగ్గునాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, నాయకుడు రౌతు జీవరత్నం తదితరులు ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు. అనంతరం సంతాపం ప్రకటించారు. కృష్ణమూర్తికి భార్య అన్నపూర్ణ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఏఎంసీకి పార్థివదేహం: కృష్ణమూర్తి ఆలోచనలకు అనుగుణంగా కుటుంబ సభ్యులు ఆయన పార్థివ దేహాన్ని ఆంధ్రా మెడికల్ కళాశాలలో పరిశోధనల కోసం అప్పగించారు. ఆయన నేత్రాలు ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేశారు.

ఆర్థిక ప్రగతికి ప్రభుత్వరంగ సంస్థలు కీలకం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థల వల్లే దేశంలోని ఆర్థిక వ్యవస్థ పురోగతి సాధిస్తుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలో 797వ రోజు, బుధవారం సంస్థకు చెందిన పలువురు కార్మికులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ దేశంలో ఉన్న బలహీన వర్గాలు, పేదల సంక్షేమాన్ని విస్మరించి కేంద్ర ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తలకు దేశ సంపదను దోచిపెడుతోందని విమర్శించారు. కార్మికుల హక్కులను కాలరాయడానికి ప్రయత్నిస్తోందన్నారు. బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నాయన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయానికి కేంద్ర ప్రభుత్వం స్వస్తి పలికే వరకు వినూత్న రీతిలో నిరసన తెలియజేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. పోరాట కమిటీ నాయకులు,కార్మికులు పాల్గొన్నారు.

వార్డు సమస్యలపై కమిషనర్‌కు వినతి



కమిషనర్ సాయికాంత్ వర్మకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సూర్యకుమారి

పెదగంట్యాడ: గ్రేటర్ పరిధి 77వ వార్డులో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మకు వినతిపత్రం సమర్పించారు. బీసీ రోడ్డు ట్రిడ్కో కావడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన్నంగా ఉండటంతో మురుగు పేరుకుపోయి, దుర్గంధం, దోమలతో అవస్థలు పడుతున్నారన్నారు. నగరానికి తమ వార్డు దూరంగా ఉండటంతో అధికారులు పట్టించుకోవడం లేదని చెప్పారు. ఇప్పటికైనా స్పందించి నిధులు మంజూరు చేసి రోడ్లు, డ్రైన్లు నిర్మించాలని విన్నవించారు. స్పందించిన కమిషనర్ వార్డులోని సమస్యలను పరిష్కరిస్తామన్నారని ఆమె తెలియజేశారు.

నూకాంబిక ఆలయంలో లలితా పారాయణం



ఆలయంలో పారాయణం చేస్తున్న భజన బృందాలు

అగనంపూడి: అనకాపల్లి నూకాంబిక ఆలయంలో నెల పండగ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలకు అగనంపూడిలోని వివిధ భజన మండళ్లకు చెందిన వందల మంది మహిళలు హాజరయ్యారు. ఆలయ ఆవరణలో లలితా సహస్ర నామావళి, హనుమాన్ చాలీసాను పఠించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బృంద గానంతో ఆకట్టుకున్నారు.